ఆల్ ఆంధ్ర నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తిమ్మప్ప



తిమ్మప్పను అభినందిస్తున్న ఉద్యోగులు, అధికారులు

అనంతపురం : ఆల్ ఆంధ్ర యూనివర్సిటీల నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడుగా శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ నాన్ టీచింగ్ అధ్యక్షుడు తిమ్మప్ప ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా తిమ్మప్పను యూనివర్శిటీ రిజిస్ట్రార్ రమేష్‌బాబు అభినందించారు. అనంతరం రిజిస్ట్రార్ మాట్లాడుతూ నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం పని చేయాలని సూచించారు. అంతేగాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, అధికారులతో మన్ననలు పొందాలిని సూచించారు

కార్మికులను నిర్లక్ష్యం చేస్తే ప్రతిఘటన

- సమస్యల పరిష్కారమే అజెండాగా పోరాటాలు
- మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి మాలిని మెస్తా
- అనంతలో ముగిసిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర మహాసభలు
- రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక
- అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా వరలక్ష్మి, దయా రమాదేవి

సమావేశంలో మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి మాలిని మెస్తా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మధ్యాహ్న భోజన పథకం కార్మికులను నిర్లక్ష్యం చేస్తే ప్రతిఘటన తప్పదని దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే అజెండాగా భవిష్యత్ పోరాటాలు నిర్వహిస్తామని ప్రజా కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంగా రెండు రోజులుగా జరిగిన ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలు చైతన్య భరితంగా సాగాయి. గణేనాయక్ భవన్‌లోని రంజనా నీరులా ప్రాంగణంలో ఆదివారం రెండో రోజు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన మహాసభలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పాల్గొన్న ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయా ప్రాంతాల్లో మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. భవిష్యత్ పోరాటాలే అజెండాగా పలు తీర్మాణాలు చేశారు. ఈ తీర్మాణాలకు సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మహాసభల ముగింపు సందర్భంగా పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా కార్మిక, కర్షక సంఘాల నాయకులు మద్దతుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ పరిష్కారం చూపలేకపోతోందన్నారు. ప్రభుత్వాల్లో మనుషులు మారుతున్నారే తప్ప విధానాలు మారలేదన్నారు. ప్రపంచ బ్యాంకు ప్రపంచీకరణ విధానాలు అనుసరిస్తు ప్రజలపై భారాలు మోపుతున్నాయని తెలిపారు. అదాని, అంబాని ఆస్తులు పెంచడానికి కార్పొరేట్ విధానం తీసుకొచ్చి విద్య, వైద్యం రంగాల సేవలు ప్రజలకు దూరం చేస్తున్నారన్నారు. ప్రజల్లో అంతరాలు పెరిగి పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారని తెలిపారు. సేవా రంగం ఉద్యోగులు, ఉత్పత్తి రంగాల కార్మికులు, కర్షకులతోనే సంపద సృష్టి జరుగుతుందని అలాంటి సంపద సృష్టికర్తలను ప్రోత్సాహం లేదని అన్నారు. మోడీ ప్రభుత్వం మాత్రం సంపద సృష్టికర్తలు అదాని, అంబానిలని గొప్పలు చెబుతు వారి ఆస్తులు పెంచడానికి పని చేస్తున్నారని విమర్శించారు. కార్మిక చట్టాలు సవరించి మరింత దోపిడీలకు గురి చేస్తున్నారని తెలిపారు. హిందూత్వ పేరుతో చీలికలు సృష్టించి అధికారం కొనసాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోనూ పి4 విధానం అంటూ దత్తత తీసుకుంటామంటూ మాటల్లో చెప్పడం తప్ప చేతల్లో ఏమి లేదన్నారు. ఉచితంగా అందాల్సిన సేవలను ప్రయివేటీకరిస్తే ఎలా పేదరికం తగ్గుతుందని ప్రశ్నించారు. మోడీ చంద్రబాబులు పేదరికాన్ని పెంచుతున్నారని విమర్శించారు. పెట్టుబడి దారీ వ్యవస్థ పరిష్కారం చూపలేకపోతుందని సోషలిజమే అన్నింటికి పరిష్కారం లభిస్తుందని అన్నారు. మార్పు కోసం సిఐటియు పోరాడుతుందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.3 వేలు చెల్లించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా సెంట్రల్ కిచెన్ విధానాన్ని కడప జిల్లాలో 2 మండలాల్లో ప్రారంభించిందన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఉపాధి కోల్పోకుండా వారిని అలాగే కొనసాగించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి మాలిని మెస్తా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ కోతలు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం అన్యాయంగా ఉందన్నారు. గతంలో రూ.13900 కోట్లు కేటాయిస్తే 2025-26కు రూ.12500 కోట్లు కేటాయించిందన్నారు. కార్మికులు 3 గంటలు మాత్రమే పని చేస్తున్నారంటూ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం అన్యాయంగా ఉందన్నారు. ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క వేతనం చెల్లిస్తున్నారన్నారు. కేరళలో రూ.16 వేలు, హర్యానాలో రూ.7,500, కర్నాటకలో రూ.4, 500, ఆంధ్రప్రదేశ్‌లో రూ.3 వేలు వేతనాలు ఉన్నాయన్నారు. దేశ వ్యాప్తంగా కార్మికులకు రూ.15 వేలు కనీస వేతనం ఇవ్వాలని బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ కర్నాటక తరహాలో ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో వేతనాలు ఇస్తున్నట్లు కార్మికులకు 12 నెలలు వేతనాలు ఇవ్వాల్సిందే నన్నారు. డిమాండ్ల సాధనకు డిసెంబర్‌లో కేంద్ర మంత్రుల నివాసాల వద్ద దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి మాట్లాడుతూ కనీస వేతనాల అమలు, ప్రమాద బీమా, మృతి చెందిన వారికి ఎక్స్‌గ్రేషియా రూ.లక్ష, గాయాలైన వారికి వైద్య ఖర్చులకు రూ.75 వేలు ఇవ్వాలన్నారు. గ్యాస్, స్టౌవ్‌లు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. 2 జతల యూనిఫాం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయభాస్కర్, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నూతన రాష్ట్ర కమిటీ సభ్యులతో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

మహా సభ తీర్మాణాలు

రాష్ట్ర మహాసభల సందర్భంగా భవిష్యత్ పోరాట కార్యచరణపై సభ ఏకగ్రీవంగా తీర్మాణాలు చేసింది.

1.విద్యా రంగంలో ప్రయివేటీకరణ విధానాలు ఉప సంహరించాలి.
2.మధ్యాహ్న భోజన పథకం కార్మికుల కనీస వేతనాలు రూ.15 వేలు అమలు చేయాలి.
3.కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం, ఇఎస్ఐ అమలు చేయాలి.
4.రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలి
5.నూతన విద్యా విధానం రద్దు చేయాలి.

రాష్ట్ర నూతన కమిటీ

41 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. వీరిలో 17 మంది ఆఫీస్ బేరర్స్‌గా ఎన్నికయ్యారు. ఆంధ్ర ప్రదేశ్ మధ్యాహ్నభోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలుగా జి.వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా దయా రమాదేవి, కోశాధికారిగా మద్దూరి నాగమణి (అనంతపురం), ఉపాధ్యక్షులుగా ఏ.మహాలక్ష్మి (శ్రీకాకుళం), బి.సుధారాణి (విజయనగరం), ఎం.నాగమణి (ఏలూరు), శివకుమారి (పల్నాడు), ఎంసిహెచ్.సుప్రజ (ఎన్టీఆర్ జిల్లా), కల్పన (ప్రకాశం), ఎస్‌కె. రెహానా (నెల్లూరు), సహాయ కార్యదర్శిగా వై.శాంతి (పార్వతీపురం మన్యం), మంగశ్రీ (విశాఖపట్టణం), నాగవరలక్ష్మి (అంబేద్కర్ కోనసీమ), జి.సమ్మక్క (కృష్ణ), విజయమ్మ (తిరుపతి), పుష్ప (రంపచోడవరం) కర్నూలు జిల్లాకు కోఆప్షన్‌ను కేటాయించారు.

జి. వరలక్ష్మి

దయా రమాదేవి

మద్దూరి నాగమణి

సమస్యల పరిష్కారానికే 'రణభేరి'

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయులతోపాటు విద్యారంగం, ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన రణభేరి జాతాలో పెద్దఎత్తు పాల్గొని విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో యుటిఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన పిఆర్‌సి, ఐఆర్‌ను ప్రకటిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చాక ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నప్పటికీ పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలు ఇవ్వలేదన్నారు. గత పిఆర్‌సి బకాయిలు రూ.30వేలకోట్లు ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందన్నారు. వెంటనే పిఆర్‌సి కమిషన్ నియమించి 30శాతం ఐఆర్ ప్రకటించాలని, సెల్‌ఫోన్ లేని పాఠశాల వ్యవస్థను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇకపోతే రేపు కర్నూలులో పశ్చిమ రాయలసీమ రణభేరి ప్రచార జాతా ప్రారంభమై 16దీన మంగళవారం గుంతకల్లులో అనంతపురంలోకి ప్రవేశిస్తుందన్నారు. అక్కడి నుంచి ఉరవకొండ కళ్యాణదుర్గం మీదుగా అనంతపురం చేరుకుంటుందన్నారు. జాతాతోపాటు ఉపాధ్యాయుల బైక్ ర్యాలీ ఉంటుందన్నారు.

అనంతపురంలో కళ్యాణదుర్గం బైపాస్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ బైకు ర్యాలీ ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధాయులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య జిల్లా సహాధ్యక్షులు రామప్ప, సహాధ్యక్షురాలు సరళ, కోశాధికారి రాఘవేంద్ర, జిల్లా కార్యదర్శి ప్రమీల, అర్జున్, సంజీవ్‌కుమార్, శేఖర్, సుబ్బరాయుడు, అబ్దుల్‌వహాబ్, మోడల్ స్కూల్ నాయకులు వెంకటేశులు, శివానంద, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

అంగన్‌వాడీలకు కనీస వేతనాలు చెల్లించాల్సిందే..

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు-మినీ అంగన్వాడీల అప్‌గ్రేడ్‌పై హర్షం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీ కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాల్సిందేనని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా రాష్ట్ర ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేయడాన్ని హర్షిస్తూ నగరంలోని హెచ్‌ఎల్‌సి మెడికల్ హాల్‌లో సంఘం జిల్లా అధ్యక్షురాలు శకుంతల అధ్యక్షతన ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. తొలుత సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రమాదేవి ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల పోరాటం ఫలిచిందన్నారు. తమ పక్షాన పోరాడినందుకు సిఐటియు నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జి.ఓబులు, నాగేంద్రకుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు ఐక్య పోరాటాలు ఫలించాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 4687 మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. గత ప్రభుత్వ కాలంలో 42 రోజుల సమ్మె చేసిన సందర్భంగా ఇచ్చిన హామీరి కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. రాష్ట్రంలో మిగిలిన 1810 సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలని.. అంత వరకూ వారికి మెయిన్ వర్కర్లకు ఇస్తున్న వేతనంతో సమానంగా వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ రెప్స్ యూనియన్ మాజీ జాతీయ నాయకులు ఏజి.రాజమోహన్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రమాదేవి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి కాత్యాయిని, ప్రాజెక్ట్ నాయకులు శ్రీదేవి, రేష్మ, మహాలక్ష్మి, ధనలక్ష్మి, విజయ, కళ్యాణి, పదోన్నతి పొందిన కార్మికులు పాల్గొన్నారు.

హర్షం వ్యక్తం చేస్తున్న మినీ అంగన్వాడీలు

పింఛన్ ఇవ్వండి సారూ..

మూడేళ్లుగా మంచానికే పరిమితమైన కృష్ణమూర్తి పింఛన్ కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి-శింగనమల

'మూడేళ్లగా మంచానికే పరిమితమయ్యా.. నడవలేని స్థితిలో కుటుంబ పోషణ భారమైంది.. పింఛన్ ఇచ్చి ఆదుకోండి సారూ..' అంటూ మండల పరిధిలోని శోదనపల్లికి చెందిన వికలాంగుడు బోయ కృష్ణమూర్తి వేడుకుంటున్నాడు. వివరాల్లోకి వెళ్తే...

శోదనపల్లి గ్రామానికి చెందిన బోయ కృష్ణమూర్తి నరాల బలహీనత, ఆర్థోపెడిక్ సమస్యతో వణుకుతూ కాళ్లు చేతులు పెనబడుతున్నాయి. దీంతో దాదాపు మూడేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. కృష్ణమూర్తి టీకొట్టు పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఉన్నఫలంగా కృష్ణమూర్తికి ఆరోగ్య సమస్య వచ్చి మంచానికి పరిమితం కావడంతో కుటుంబ దిక్కుతోచని స్థితిలో ఉండిపోయింది. అతడికి సపర్యలు చేసుకుంటూ భార్య కూడా ఇంటి వద్దే ఉంటోంది. ఈనేపథ్యంలో కూలినాటి చేసుకుని జీవించే కృష్ణమూర్తి కుటుంబం పోషణ భారమైంది. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు కూడా తండ్రికి సేవ చేస్తూ చిక్కినప్పుడల్లా కూలి పనికి వెళ్తూ చేదోడువాదోడుగా ఉంటున్నాడు. కాగా ఆర్థపెడిక్ సమస్యతో వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స చేయించుకోగా 2023వ సంవత్సరంలో మెడికల్ సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ సరిఫికెట్‌లో (ఐడి నెంబర్ 112110160113000028) 71 శాతం వికలత్వం కల్పించారు. ఈ సర్టిఫికెట్‌తో మూడేళ్ల నుంచి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి వికలత్వ పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్నా ఫలితం లేకుండా పోతుందని కృష్ణమూర్తి కుటుంబం వాపోతోంది. నడవలేని కృష్ణమూర్తిని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిప్పేందుకు నానాకష్టాలు పడుతున్నానని.. అయినా కరుణించేవారు కరువయ్యారని కృష్ణమూర్తి భార్య ఆవేదన వ్యక్తం చేస్తోంది. రెక్కాడితేగాని డొక్కాడని కృష్ణమూర్తి కుటుంబానికి వికలత్వ పింఛన్ వస్తే కనీసం వైద్యం, మందుల ఖర్చులకు అయినా వస్తుందని వేడుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ కుటుంబ దీనస్థితిని గమనించి పింఛన్ మంజూరు చేయాలని కృష్ణమూర్తి కుటుంబం వేడుకుంటోంది.

మంచానికే పరిమితమైన కృష్ణమూర్తి

పకడ్బందీగా ఆహార భద్రత చట్టం అమలు

ఫుడ్ సేఫ్టీ అథారిటీ జిల్లా అధికారి రామచంద్ర

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఆహార భద్రతా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని ఫుడ్ సేఫ్టీ అథారిటీ సత్యసాయి జిల్లా అధికారి ఎస్ రామచంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తమ శాఖ పరిధిలో అమలు పర్చుతున్న చర్యల గురించి వివరించారు.

ప్రశ్న : జిల్లా ప్రజల ఆహార భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: జిల్లాలోని హోటళ్లు,రెస్టారెంట్లు, కిరాణా కొట్లను ఫుడ్ సేఫ్టీ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తురు. ఎవరైనా అధిక ధరలకు సరుకులు అమ్మిన లేక కాలం చెల్లిన వాటిని విక్రయించినా అలాంటి వారిపై చర్యలు తీసుకొని జరిమానాలు విధిస్తున్నాం. అదేవిధంగా రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలను తరచూ తనిఖీ చేస్తున్నాం. వినియోగదారుల ఫిర్యాదు మేరకు కల్తీ నూనెలు కాలం చెల్లిన సరుకులు, ఫ్రిజ్జులలో ఎక్కువ కాలం నిలువ ఉంచిన ఆహారం పెట్టినా వారి పై తగిన చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : ఆహార భద్రత చట్టం పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా ?

జ: ప్రభుత్వం ఆహార భద్రత చట్టం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది. వినియోగదారులకు అందించే సేవలపై హోటళ్లు,రెస్టారెంట్లు, కిరాణా కొట్లు, డాబాలు యజమానులకు సూచనలు ఇస్తున్నాం. ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా నుండి వారికి లైసెన్సులు మంజూరు చేస్తున్నాం. లైసెన్సులు లేనిరెస్టారెంట్లను మూసివేసి వారిపై తగిన చర్యలు తీసుకుంటున్నాం. అంతేకాక కల్తీ ఆహారం చేసేవారిపై జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 ప్రకారం కేసులు నమోదు చేస్తున్నాం.

ప్ర : జిల్లా ప్రజలకు మీరిచ్చే సలహాలు సూచనలు ఏవీ?

జ: వినియోగదారులు మోసపోకుండా ఆహార భద్రత కల్పించడం పలు చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా హోటళ్లు, దాబాలు, కాఫీ షాపులు, తినుబండారాలకు సంబంధించి విక్రయితలు తమ లైసెన్స్ రిజిస్టేషన్ సర్టిఫికెట్‌తో పాటు క్యూఆర్ కోడ్‌లను తమ దుకాణాల వద్ద ప్రదర్శించే విధంగా సూచించాం. దాన్ని వినియోగదారులు గ్రహించాలి. ప్రజలు ఆహార భద్రత పరిశుభ్రత సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు చేయవచ్చు. ఆహార ఉత్పత్తులపై తప్పుదారి పట్టించే ప్రకటనలపై ఫిర్యాదులు చేయవచ్చు.

ప్ర : జిల్లాలో ఇటీవల జరిగిన దాడుల్లో ఎలాంటి పురోగతి సాధించారు. ?

జ: శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలో ఇటీవల కదిరిలో ఒక సంఘటన చోటుచేసుకుంది. హోటల్ యజమాని నిబంధనలు పాటించకుండా ఎక్కువ కాలం ఆహార పదార్థాలను నిల్వ ఉంచి సరఫరా చేస్తుండడం తదితర అంశాలు తమ తనిఖీలో బయటపడ్డాయి. దీంతో ఆ హోటల్ నిర్వాహకులపై చర్యలు తీసుకున్నాం. ఆహార పదార్థాల శాంపుల్‌ను సంబంధిత ల్యాబుకు పంపాము. వాటి రిపోర్టు రాగానే తగిన చర్యలు తీసుకుంటాం. వినియోగదారులను మోసగిస్తే ఎలాంటి వారిపైనా చర్యలు తీసుకుంటాం.

ప్ర : భద్రత ప్రమాణాలు విస్మరిస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: నిత్యావసర వస్తువులైన బియ్యం, కూరగాయలు, పప్పులు, ఉప్పు, మాంసం, గ్రుడ్లు ,పండ్లు, నూనె లాంటి వస్తువులతోపాటు డెయిరీ ఉత్పత్తులైన పాలు, పెరుగు, శీతల పానీయాలు, బేకరీ ఉత్పత్తులు కేకులు ,బ్రెడ్లు తినుబండారాలను ఎప్పుడు ప్యాక్ చేశారు వాటి ఖరీదు ఎంత వాటి బరువు ఎంత ఎప్పటి వరకు వినియోగించాలనే అంశాలను పరిశీలించి, కాలం చెల్లిన వాటిని విక్రయిస్తున్నారని తేలితే అలాంటి వారిపై చర్యలు తీసుకొని నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే జరిమానాలు విధిస్తాం.

కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే

డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-పామిడి

కంటిచూపు లేకుంటే ఎవరికైనా జీవితం అంధకారమే అని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు అన్నారు. ఆదివారం పామిడిలోని భావసార క్షత్రియ కళ్యాణ మండపంలో పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా శంకర కంటి ఆసుపత్రి (బెంగుళూరు) కంటి వైద్య నిపుణులు డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో దాదాపు 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 45 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. అనంతరంకంటి సంరక్షణ, జాగ్రత్తలు, నివారణ, బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్, సూక్ష్మక్రిముల నుంచి కళ్లను ఎలా రక్షించుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరంలో జిల్లా ఛైర్‌పర్సన్స్ డాక్టర్ శాంతి ప్రియ, డాక్టర్ మురళీకృష్ణ, మానవ హక్కుల కమిషన్, పర్యావరణ పరిరక్షణ దక్షిణ భారత సెక్రటరీ ఆవుల ప్రసాద్, లయన్స్ క్లబ్ కోశాధికారి డి.షేక్షావలి, క్లబ్ నిర్వాహకుడు ఆర్ఎంపి వైద్యులు గంగాశేఖర్, మార్కెటింగ్ ఛైర్‌పర్సన్ తూర్పింటి ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పత్రా నరేష్‌కుమార్, సర్వీస్ ఛైర్‌పర్సన్ మహేష్, డైరెక్టర్లు ఎ.నాగరాజు, పత్రా రాకేష్, ప్రభాకర్, శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ శివ, శంకర హాస్పిటల్, లక్ష్మీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలి

జిల్లా నాయకులు రామాంజనేయులు

సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

ప్రజాశక్తి తాడిపత్రి

భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని గాంధీ కట్ట వద్ద సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహారెడ్డి అధ్యక్షతన భవన నిర్మాణ కార్మిక మహాసభ నిర్వహించారు. ముందుగా గాంధీ కూడలి నుంచి గాంధీ కట్ట వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం జెండాను చేనేత కార్మిక సంఘం నాయకులు చౌదయ్య ఆవిష్కరించారు. ఈ మహాసభలకు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రామాంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక వెల్ఫేర్ బోర్డు సంక్షేమ చట్టం భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదన్నారు. ప్రభుత్వాలు ఇష్టానుసారం జీవోలు జారీ చేసి నిధులను దారి మళ్లించి కార్మిక సంక్షేమ బోర్డులు నిర్వీర్యం చేసి కార్మికులను రోడ్డుల పడేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మహాసభ సందర్భంగా కార్మికుల సమస్యలపై కూలంకషంగా చర్చించి భవిష్యత్తు కరాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జగన్మోహన్ రెడ్డి, ఉమాగౌడ్, రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, ఆటో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎపి వాల్మీకి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా గంగాధర్

మాట్లాడుతున్న వాల్మీకి గంగాధర్

అనంతపురం కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ వాల్మీకి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా గంగాధర్ నియమితులయ్యారు. ఆదివారం నగరంలోని రుద్రంపేటలోని వాల్మీకి కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్ర వాల్మీకి ఉద్యోగుల సంఘం మహాసభ నిర్వహించారు. ఈ సభలో ఏకగ్రీవంగా రాష్ట్ర నూతన కమిటిని ఎన్నుకున్నారు. వాల్మీకి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా గంగాధర్ (అనంతపురం), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ (కర్నూలు), కోశాధికారిగా ఈశ్వరయ్య (శ్రీసత్యసాయి జిల్లా)తో పాటు జిల్లా నుంచి పలువురిని ఎన్నుకున్నారు. వాల్మీకి ఉద్యోగుల సంఘం అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధాకర్, నారాయణస్వామిను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో 13 జిల్లాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

పెద్దవడుగూరు : మండలవ్యాప్తంగా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి, సిఐటియు మండల కార్యదర్శి ఈశ్వర్‌రెడ్డియాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడు రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గ్రామాల్లోని వీధులు బురదమయమై దోమలకు ఆవాసాలుగా మారాయన్నారు. దీంతో విషజ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. వైరల్ ఫీవర్లతో ఇప్పటికే చాలామంది ఆసుపత్రికి క్యూ కడుతున్నారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు చికిత్సలు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామాల్లో క్లోరినేషన్, బ్లీచింగ్ పౌడర్ వంటివి చల్లాలన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి రాఘవరెడ్డి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించన్నట్లు ఎంపిడిఒ ఒక ప్రకటనలో తెలిపారు. కావున మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

24న ఆలయ హుండీ లెక్కింపు

ఆత్మకూరు : మండలంలోని పంపనూరు గ్రామంలో వెలసిన సుబ్రమణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన హుండీని ఈనెల 24వతేదీన లెక్కించనున్నట్లు ఇఒ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించనున్న హుండీ లెక్కింపు కార్యక్రమానికి వచ్చేవారు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని కోరరు.

ఆటో, క్యాబ్ డ్రైవర్లను మోసం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-గుంతకల్లు

మహిళలకు ఉచిత బస్సు కారణంగా నష్టపోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లలందరికీ ఏడాదికి రూ.15వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు కేవలం ఆటో యజమానులకు మాత్రమే వాహన మిత్ర పథకం అమలు చేస్తామంటూ మోసం చేస్తోందని సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగ రాజు ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. రోజు రోజుకీ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, కరెంటు ఛార్జీలు, ఆటో స్పేర్‌పార్ట్స్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో క్యాబ్, డ్రైవర్లకు ఏడాదికి రూ.25 వేల ఆర్థికసాయం ప్రకటించాలన్నారు. వారికి సాధికారిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సిఎన్‌జి గ్యాస్ సబ్సిడీతో అందించాలని, వేలాది రూపాయలు జరిమానాలు విధించే జీవో 21ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ప్రకటించిన వాహన మిత్ర పథకం అమలులో పెట్టిన ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ 300 యూనిట్లు ఐటి రిటన్స్, 1,000 చదరపు అడుగుల ఇల్లు ఉంటే వాహన మిత్రకు అనర్హులు అని ప్రకటించటం సరైంది కాదన్నారు. ఆయా ఆంక్షలను ఎత్తివేసి ప్రతి ఒక్క ఆటో, క్యాబ్ డ్రైవర్‌కు వాహన మిత్ర అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి

వర్థంతి కార్యక్రమంలో వక్తలు

సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సిపిఎం, అనుబంధ సంఘాల నేతలు

ప్రజాశక్తి-పామిడి

సిపిఎం జాతీయ మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేద్దామని సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నీల రామాంజనేయులు పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి వర్థంతిని పురస్కరించుకుని రైతుసంఘం మండల ప్రధాన కార్యదర్శి సాయి అధ్యక్షతన స్థానిక సిపిఎం కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏచూరి మరణం దేశ ప్రజలకు తీరని లోటు అన్నారు. సమసమాజ స్థాపనకు కృషి చేసినప్పుడే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. సీతారాం ఏచూరి విద్యార్థి ఉద్యమం నుంచి పేదలు, సమాజం, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడటం కోసమే పని చేశారన్నారు. ప్రపంచ దేశాల్లో ఆయనకు సైద్ధాంతిక విషయంలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. పాలక వర్గాల తప్పులను ఎదిరించడంలో రాజ్యసభ, పార్లమెంట్‌లో ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ముఖ్యంగా సమానత్వం, సోషలిజం కోసం అకుంఠిత దీక్షతో పని చేశారన్నారు. మతోనాదాన్ని రెచ్చగొట్టడం, దేశ స్వాతంత్ర్య పోరాటంలో దేశానికి ద్రోహం చేసిన వారు నేడు దేశాన్ని పాలిస్తున్నారన్నారు. బ్రిటీష్ వారికి ఏజెంట్లుగా ఉంటామని లేఖలు రాసిన బిజెపి నేడు పాలకులుగా రావడం దేశ దౌర్భాగ్యమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీతారాం ఏచూరి లేకపోవడం భారత దేశ ప్రజలకు తీరని లోటు అన్నారు. దోపిడీకి వ్యతిరేకంగా, సమ సమాజం కోసం ఆయన స్ఫూర్తితో కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, కామ్రేడ్ మల్లేష్, సిఐటియు అనంతపురం రూరల్ నాయకులు పుష్పరాజ్, ఎపి రైతు సంఘం మండల అధ్యక్షులు లక్ష్మణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సాయికుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు మాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి శివకుమార్, రైతు సంఘం మండల కమిటీ మెంబర్లు హుస్సేనప్ప, రామగిరి ఎరుకలప్ప, జయరాముడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శికి పరామర్శ

యాడికి : హైదరాబాద్‌లో బ్రెయిన్ సర్జరీ చేయించుకుని తాడిపత్రిలోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న వైసిపి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలతను సీనియర్ నాయకులు బొంబాయి రమేష్‌నాయుడు, భార్య ఉమాదేవి ఆదివారం పరామర్శించారు. ఇందులో భాగంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా 'కోలుకోవాలని ఆకాంక్షించారు.

మార్కెట్ సంతల వేలం

అనంతపురం : స్థానిక మార్కెట్ యార్డులోని పశువులు, గొర్రెలు, మేకలు సంతల వేలంపాట ద్వారా రూ.3,51,800 ఆదాయం వచ్చినట్లు ఇన్‌ఛార్జి మార్కెట్ యార్డు కార్యదర్శి రాఘవేంద్రకుమార్, సూపర్‌వైజర్ కిశోషర్‌కుమార్ తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

నార్పల : మండలం కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురికి దంత పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు.

నేడు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

శింగనమల : పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో స్టార్మ్ రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ శేషారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

వైద్యులు యామియా భూషణ్, హాజీరా

ప్రజాశక్తి-నార్పల

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమతంగా ఉండాలని నార్పల మండల వైద్యులు యామియ భూషణ్, హాజీరా ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. మండలంలో చిన్నారులకు వైరల్ ఫీవర్స్ అధికంగా వస్తున్నాయన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడంతోపాటు పరిసరాల పరిశుభ్రత, ఇళ్లల్లో నీరు నిల్వ లేకుండా చేయడం, వీధుల్లో వర్షం, మురికి నీరు లేకుండా చూసుకోవాలన్నారు. ఒకవేళ నీరు నిల్వ ఉంటే దోమలు చేరి మలేరియా, టైఫాయిడ్, తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. జ్వరం కేసులు నమోదైన గ్రామాల్లో హెల్త్ క్యాంప్‌లు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామస్థాయిలో పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి, కుండలు, ట్యాంకులు, చుట్టుపక్కల వర్షం నీరు నిల్వ కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు దోమతెరలు వాడాలన్నారు. వేడి చేసి కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. అనారోగ్యంగా ఉంటే సమీప వైద్యశాలలో వైద్యం చేయించుకోవాలని సూచించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పట్టని ప్రభుత్వం

ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయరాజు

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయరాజు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు హృదయరాజు అన్నారు. ఆదివారం అనంతపురంలోని ఎన్‌జిఒ హోంలో ఎపిటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 15 నెలలు గడిచినా ఇప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు, 4 విడతల డిఎలు, ఆర్థికేతర అంశాలు పెండింగ్‌లో పెట్టడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు చెప్పుకుంటున్న సంక్షేమంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమం ఉందా.. లేదా.. అన్న అనుమానాలు వ్యక్తం చేశారు. కనీసం దసరా పండుగకైనా పెండింగ్ డీఏలు ప్రకటించాలని, 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించి 30శాతం ఐఆర్ అమలు చేయాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై రానున్న రోజుల్లో పోరాటాలకు సిద్ధం కానున్నట్లు తెలిపారు. విశిష్ట అతిథి డిఇఒ ప్రసాద్‌బాబు జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ప్రత్యేక చొరవతో పని చేసి జిల్లా విద్యా వికాసాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం ప్రముఖ గైనకాలజిస్ట్, తిరుమల ఆసుపత్రి ఎండి డాక్టర్ సింధు మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల పరిష్కారాలకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎటిపిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్‌నాయక్, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, విశ్వనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రఫీ, జిల్లా గౌరవాధ్యక్షులు వరప్రసాద్, ఐఫియా కమిటీ సభ్యులు సత్యప్రసాద్, పూర్వ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ రెడ్డి, జిల్లా పూర్వ అధ్యక్షులు రవీంద్ర, అసోసియేట్ అధ్యక్షులు పోతులయ్య, అదనపు కార్యదర్శి ఆంజనేయులు నాయక్, జిల్లా కార్యదర్శి అశోక్‌నాయక్, ఉపాధ్యక్షులు వజీర్‌బాషా, సాయినాథ్‌రెడ్డి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైల్వే ఉద్యోగి భార్య ఆత్మహత్య

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే క్వార్టర్స్‌కు చెందిన రైల్వే ఉద్యోగి హరి భార్య శిరీషా (32) ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శిరీషా కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేది. ఆ బాధను భరించలేక ఇంటిలో ఎవరూ లేని సమయంలో పైకప్పు ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

తండ్రీకొడుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కారు ఢీకొనడంతో తండ్రి మృతి చెందగా కుమారుడు గాయపడిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. కదిరి పట్టణానికి చెందిన బుదిలి అల్లాబకాష్ (50) బీడిల వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే వాడు. ఈ క్రమంలో అల్లాబకాష్ చిన్న కుమారుడు రియాజ్‌తో కలిసి కదిరి నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా స్థానిక వెంకటసాయి ఐటిఐ సమీపంలో ఓ కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అల్లాబకాష్‌ను స్థానికులు 108లో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రియాజ్‌కు గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసి ఆ తర్వాత కదిరి ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని పిల్లలపల్లి గ్రామానికి చెందిన రాహుల్ (16) కనిపించలేదని విద్యార్థి తల్లి స్వరూప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి తల్లి తెలిపిన వివరాల మేరకు.. రాహుల్ కళ్యాణదుర్గం జ్ఞాన భారతి పాఠశాలలో 10వ తరగతి పాసైన రాహుల్ ఆదివారం ఉదయం నుంచి కనిపించడం లేదన్నారు. ఆచూకీ తెలిస్తే సెల్..97048 25447 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

గోరంట్ల : మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. అనంతపురానికి చెందిన మనోహర్, అతని భార్య విజయ్ కుమారి, ఇద్దరు పిల్లలతో కలిసి స్కార్పియో వాహనంలో అనంతపురం వెళ్తుండగా ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో విజయ్‌కుమారి తీవ్రంగా గాయపడడంతో అనంత పురం ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు సిఐ శేఖర్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం

టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సింగిల్ విండో అధ్యక్షులు ఓబులేసు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల పరిధిలోని సంతే కొండాపురం గ్రామంలో గ్రామ స్వరాజ్య సంస్థ, ఇన్ఫిన్స్ ఫౌండేషన్ (ఐసిఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ ట్రైనింగ్ శిక్షణ కేంద్రాన్ని సింగిల్‌విండో అధ్యక్షుడు అంకే ఓబులేసు, కోఆర్డినేటర్ అంబుజా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంత వరకు 3వేల మందికిపైగా మహిళలకు శిక్షణ ఇస్తూ 50శాతం సబ్సిడీతో కుట్టుమిషన్లు అందజేయడం గొప్ప విషయమన్నారు. ఇన్ఫిన్స్ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశం గ్రామీణ మహిళలకు ఉచితంగా ట్రైనింగ్ ఇస్తూ ఉపాధి శిక్షణ కల్పించి మహిళా సాధికారత, స్వయం ఉపాధి పథకాన్ని సాధించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. అంతేగాకుండా భవిష్యత్తులో బ్యూటీషియన్స్ కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే అందుబాటులో ఉండేందుకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం 25 కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. తర్వాత ఈ కార్యక్రమంలో ఇన్ఫిన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విజయ్ కిషోర్, బాషా, దాసరి కిరణ్‌కుమార్, ఆర్డీటీ టీచర్ మల్లికార్జున, గ్రామపెద్దలు బూత్ కన్వీనర్ నరసింహులు, లింగన్న, ఎర్రిస్వామి, జయరాజ్, ట్రైనర్లు, తదితరులు పాల్గొన్నారు.

'కూటమి'తోనే మహిళా సాధికారత

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


మహిళా సాధికార సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శ్రావణి శ్రీ

ప్రజాశక్తి-శింగనమల

కూటమి ప్రభుత్వంతోనే మహిళా సాధికారత సాధ్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సహాయ, సహకారాలతో తిరుపతిలో మహిళా సాధికారతపై పార్లమెంటరీ, శాసనసభ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి లోకసభ స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్‌పర్సన్ హరివాన్ష్ నారాయణ్ సింగ్, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మహిళా సాధికారత కమిటీ పార్లమెంట్ ఛైర్మన్ పురందరేశ్వరి, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణిశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మహిళా సాధికారతకు ఎనలేని కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే అనేక పథకాలను మహిళల పేరుపై అమలు చేస్తున్నట్లు వివరించారు.

25 నుంచి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్‌ఎస్ రైల్వే ఇన్సిట్యూట్ క్రీడా మైదానంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌతమీపురి ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ, రైల్వే ఇన్సిట్యూట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రేమ్, సూరి మెమోరియల్ ఫుట్ బాల్ టోర్నమెంట్‌లో విన్నర్ ప్రైజ్ రూ.50వేలు, రన్నర్స్‌కు రూ.25 వేలు ఉంటుందన్నారు. గుత్తి అర్‌ఎస్ కు చెందిన సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు వసంత్ కుమార్ (ప్రేమ్), సురేష్ బాబు (ఫుట్ బాల్ సూరి) జ్ఞాపకార్థంగా మిత్ర బృందం నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో ఎపి నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి భారీ జట్లు పాల్గొననున్నాయి. ఈనెల 18వతేదీలోపు టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9052653405, 9985678208, 9966560163 సెల్ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి అంత్యక్రియలు పూర్తి

అంతిమయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం, అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

ప్రముఖ వైసిపి సీనియర్ నాయకులు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి అంత్యక్రియలు ఆదివారం మండల పరిధిలోని తోపుదుర్తి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది అభిమానులు, కార్యకర్తల జన సందోహం మధ్య అనంతపురం నుంచి అంతిమయాత్ర సాగింది. అనంతపురంలోని రామచంద్రనగర్ స్వగృహం నుంచి సప్తగిరి సర్కిల్ మీదగా, రామ్‌నగర్, రుద్రంపేట, ఆలమూరు రోడ్డు మార్గంలో తోపుదుర్తి వరకూ అంతిమయాత్ర సాగింది. బ్రాహ్మణ యాలేరులో పెద్దఎత్తున ప్రజలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలు చల్లుతూ తమ అభిమాన నేతకు నివాళులర్పించారు. అనంతరం మదిగుబ్బ క్రాసు వద్ద పలువురు కన్నీరు పెడుతూ అంజలి ఘటించారు. అనంతరం తోపుదుర్తి గ్రామంలోని సొంత వ్యవసాయ క్షేత్రంలో భాస్కర్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, గుర్నాథ్‌రెడ్డి సోదరులు, ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డితోపాటు, తండ్రి ఆత్మారామ్‌రెడ్డి, వేలసంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ జెఎసి నూతన కమిటీ నియామకం

నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఎస్సీ, ఎస్టీ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి అదేశాల స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఎస్సీ, ఎస్టీ జేఏసీ మండల కమిటీని ఎన్నుకున్నట్లు తాలుకా అధ్యక్షుడు చెలిమప్ప తెలిపారు. మండల అధ్యక్షుడిగా మల్లెల మధును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జిల్లాలో పేదల బాగోగుల కోసం పని చేస్తున్న ఆర్డీటీని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం సేవ్ ఆర్డీటీ అంటూ ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ట్రెజరీ ఉద్యోగ సంఘం నాయకుడు చల్లాకిషోర్, జర్నలిస్ట్ లింగప్రసాద్, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు మల్లేష్, స్వామి, హరి, రాజేష్, మల్లికార్జున, తిమ్మప్ప, నాగరాజు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర హోటళ్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా కె.రమణ

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎస్ఎస్ ప్యాలెస్ ఫ్యామిలీ రెస్టారెంట్ నిర్వాహకులు రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుదీర్ఘకాలంగా హోటల్స్, రెస్టారెంట్స్ రంగంలో విశేషమైన సేవలు అందించినందుకు రమణకు ఈ గౌరవం దక్కింది. మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా రాయలసీమ వారిని ఎంపిక కావడంపై సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో రమణ మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శిగా హోటల్స్, రెస్టారెంట్స్ రంగంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రమణ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడంతో హోటల్స్, రెస్టారెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బివి రమణ, కార్యదర్శి ఆనంద్, ట్రెజరర్ షబ్బీర్, రాష్ట్ర ఇసి మెంబర్ రాఘవేంద్ర, సభ్యులు హరి, షూస్ సిటీ అధినేత మధు, తదితరులు అభినందనలు తెలిపారు.

హరిసర్వోత్తమరావుకు నివాళి

హరిసర్వోత్తమరావుకు నివాళులర్పిస్తున్న లైబ్రరీ సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమర యోధుడు, గ్రంథాలయ ఉద్యమ నాయకులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో హరిసర్వోత్తమరావు చిత్రపటానికి కార్యదర్శి పి.రమా పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హరిసర్వోత్తమరావు రాజకీయ ఖైదీగా పేరుపొందిన వ్యక్తిగా, స్వాతంత్ర సమర యోధుడు, పత్రికా రచయిత, సాహితీకారుడు, గ్రంథాలయ ఉద్యమ నాయకులు, ఎడిటర్, సంపాదకుడు పేరు గడించారాని ఆయన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమలో భాగంగా 'పుస్తక సమీక్ష – రచయిత పరిచయం' డాక్టర్ బివి.పట్టాభిరామ్ రాసిన గుడ్ స్టూడెంట్ అంశంపై వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు శ్రీరాములు, డాక్టర్ అంకె రామలింగయ్య, రిటైర్డ్ ఎక్సయిస్ హరి సార్ గారు మహేష్ పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థుల చేత పుస్తక పఠనం చేయించి, కథలు చెప్పించి పుస్తక విశ్లేషణ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పి.కమ్మన్న, సహాయ గ్రంథాలయాధికారి డి.గోవిందు, సిబ్బంది ముత్యాలమ్మ, పి.శివమ్మ తదితరులు పాల్గొన్నారు.